కళాశాలకు కొత్తరూపు

ఇది కదా అభివృద్ధి





తరగతి గదిలో ఏర్పాటు చేసిన బెంచీలు



ఆధునికంగా మరుగుదొడ్లు



కళాశాల ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్లు



కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్

రూ.1.26 కోట్లతో భీమిలి ప్రభుత్వ కాలేజీకి ఆధునిక హంగులు

భీమిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కొత్తరూపు సంతరించుకుంది. గతంలో కనీస సదుపాయాలు లేకపోవడంతో అనేక సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దెబ్బతిన్న తరగతి గదులు, పాడైపోయిన బెంచీలు, సరైన మరుగుదొడ్లు, స్వచ్ఛమైన నీరు లేకపోవడంతో అవస్థలు పడేవారు. ఇక్కడ చదువుతున్న 750 మంది విద్యార్థులతోపాటు, అధ్యాపకులు కూడా నిత్యం నరకయాతన అనుభవించేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిధులు కేటాయించడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 'నాడు – నేడు' పథకం కింద రూ.1.26 కోట్లతో కార్పొరేట్ తరహాలో ఆధునికీకరించారు. రూ 23.12 లక్షలతో రెండు చోట్ల మరుగుదొడ్లు నిర్మించారు. రూ 28.44 లక్షలతో గదులకు మరమ్మతులు చేపట్టి, పెయింటింగ్ వేశారు. రూ.8 లక్షలతో స్వచ్ఛమైన తాగునీరు అందించే రెండు ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా రూ.20.99 లక్షలతో అన్ని తరగతి గదుల్లోనూ చక్కని బెంచీలు, ఫ్యాన్లు, ఇతర సౌకర్యాలు కల్పించారు. ఈ పనులన్నీ పూర్తి కావడంతో ఒక్కసారిగా కళాశాల రూపురేఖలు మారిపోయాయి. గతంలో ఇలా ఎన్నడూ లేకపోగా... ప్రస్తుతం ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి రావడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– భీమునిపట్నం

ఇలా మారుతుందని ఊహించలేదు



ప్రభుత్వ కళాశాలలో వసతులు, సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉంటాయని అందరికీ తెలిసిందే. నేను కూడా అంతే అనుకున్నా. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు కేటాయించడంతో సకల సౌకర్యాలతో ఊహకందని రీతిలో అభివృద్ధి చేశారు. – వి.శ్రీవల్లి, ఎంఎల్‌టీ, తగరపువలస

సదుపాయాలు సూపర్



మాకు ఎంతో అవసరమైన తరగతి గదుల్లో సదుపాయాలు, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలు ఎంతో బాగున్నాయి. ఇవి గతంలో లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు అందరికీ సౌకర్యవంతంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి వుంటాం.

– ఎం.అనిల్, ఇంటర్, కురపల్లి

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



కళాశాలలో సరైన సదుపాయాలు లేకపోవడంతో రోజూ అవస్థలు పడేవారిమి. చదువుపై పూర్తిగా శ్రద్ధ పెట్టలేని పరిస్థితి ఉండేది. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక అన్ని సదుపాయాలు ఒక్కసారిగా అందుబాటులోకి రావడంతో చక్కగా చదువుకోవడానికి వీలు కలిగింది. సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. – పి.దుర్గా కామేశ్వరి, ఇంటర్, మారికవలస

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత



పోస్టర్లు ప్రదర్శిస్తున్న శ్రీనివాసరావు, విద్యార్థులు

భీమునిపట్నం: ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ వినియోగం చాలా ఎక్కువగా పెరిపోయిందని, అందువల్ల దాన్ని పొదుపుగా వాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు అన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆయన శుక్రవారం అవగాహన కలిగించారు. అనవసరంగా విద్యుత్ వినియోగిస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. డీఈ రొంగలి రమేష్, భీమిలి, చిట్టివలస ఏఈలు యు.నకరయ్య, బొట్ల రవి, కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రసాద్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



బంగారు పతకాలతో సాయి చరణ్, చిట్టిబాబు

తగరపువలస: ఈ నెల 9, 10న పాండిచ్చేరి ఇందిరా గాంధీ స్పోర్ట్స్ స్టేడియంలో షోటోకాన్ ఇండియన్ కరాటే డో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ – 2023లో భీమిలి విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. మండలంలోని రేఖవానిపాలెం పంచాయతీ మహాలక్ష్మీపురానికి చెందిన డిగ్రీ విద్యార్థి కర్రి చిట్టిబాబు 55 కిలోల విభాగంలో, జీవీఎంసీ రెండో వార్డు రాజలింగంపేట గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి బర్ల సాయిచరణ్ 35 కిలోల విభాగంలో పతకాలు సాధించారు. వీరికి శిఖా చైర్మన్ ఎం.సాల్మన్, ప్రధాన కార్యదర్శి ఎస్.పుష్పనాథన్ పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు.

క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి, గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రి మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్లారు. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

17న పింఛనుదారుల సమావేశం

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో ఈ నెల 17న నిర్వహించే పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చిట్టివలస పింఛనుదారుల సంఘం ప్రతినిధులు అల్లు బాబూరావు, దామోదర బాబాజీ కోరారు. ఈపీఎస్ – 95 పింఛనుదారుల సమస్యలు, కనీస పింఛను పెంపు, భార్యాభర్తలకు ఉచిత వైద్య సౌకర్యం, కరువు భత్యం, రైల్వేలో రాయితీ పునరుద్ధరణ, తదితర సమస్యల పరిష్కారంపై సమావేశంలో చర్చిస్తామన్నారు. రాష్ట్ర నాయకుడు సుధాకర్ తదితరులు హాజరయ్యే సమావేశానికి పింఛనుదారులు తమ పీపీవో నంబరు తీసుకురావాలని కోరారు.

వలంటీర్ల భర్తీకి ఇంటర్వ్యూలు నేడు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 పరిధిలో గల 5 నుంచి 13 వరకు గల 9 వార్డుల్లోని వలంటీర్ పోస్టుల భర్తీకి ఆదివారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి చెప్పారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. 56 ఖాళీల భర్తీకి 232 మంది దరఖాస్తు చేశారని చెప్పారు. దరఖాస్తుదారులందరికీ సమాచారం అందించామని, అంతా హాజరు కావాలని జెడ్సీ కోరారు.

పటేల్, పొట్టి శ్రీరాములుకు నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జోన్ - 2 అధికారులు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తగరపువలస: సర్దార్ వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం పలువురు నివాళులర్పించారు. వీరి చిత్రపటాలకు భీమిలిలోని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం వారు చేసిన సేవలు, త్యాగాలను కొనియాడారు. భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలపై క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు గొట్టుపల్లి సత్యనారాయణ బహుమతులు అందించారు.

అమరజీవికి ఘన నివాళి

మధురవాడ: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని మధురవాడలోని జీవీఎంసీ జోన్ – 2 కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రం కోసం చేసిన ప్రాణత్యాగాన్ని జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి గుర్తు చేశారు.

ఘనంగా ఓక్రిడ్జ్ వార్షికోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం 15వ వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. నగరంలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల క్యూరేటర్ నందిని సలారియా ముఖ్య అతిథిగా వేడుకల్లో పాల్గొన్నారు. ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన బి.మహేశ్వరదాస్ విజువల్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కస్తూర్బా విద్యార్థినులకు ప్రశంసలు

భీమునిపట్నం: భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలకు చెందిన కస్తూర్బా గాంధీ విద్యాలయాల విద్యార్థినులను జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ శుక్రవారం ప్రశంసించారు. పెందుర్తిలో ఇటీవల వివిధ దేశాల ప్రతినిధుల వేషధారణలో నిర్వహించిన మాక్ కాన్ఫరెన్స్‌లో వీరు పాల్గొన్నారు. అక్కడ ప్రదర్శన అనంతరం వీరంతా విశాఖలో జేసీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, తద్వారా ఎక్కడికైనా వెళ్లి అన్ని కార్యక్రమాల్లో ధైర్యంగా పాల్గొంటారన్నారు. డీఈవో చంద్రకళ, మూడు మండలాల కేజీబీవీ ప్రిన్సిపాల్స్ గంగాకుమారి, చంద్రకళ, గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కృషి



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన రాష్ట్రంలో స్వర్ణ యుగమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు గుడ్లవానిపాలెంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం సాగర్‌నగర్ వైఎల్‌పీ లే అవుట్‌లో రూ.45 లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్సీ కనక మహాలక్ష్మి, కార్పొరేటర్ లొడగల అప్పారావు, క్లస్టర్ ఇన్‌చార్జి గుడ్ల పోలిరెడ్డి, ఉప్పులూరి గోపి, లొడగల రామ్మోహన్, అల్లాడ ఉమామహేశ్వరరావు, నొడగల రాంబాబు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు

మధురవాడ: అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలోకి వెళ్లడంతో ఆయా కేంద్రాలు మూత పడకుండా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సచివాలయ సిబ్బంది తాత్కాలికంగా నిర్వహించేందుకు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా శనివారం జీవీఎంసీ 7వ వార్డు వాంబే కాలనీలోని రక్షిత తుపాను కేంద్రంలో నిర్వహిస్తున్న కేంద్రాల తాళాలు తీశారు. సచివాలయ కార్యదర్శులు పి.ప్రవీణ్‌కుమార్, పావని, భార్గవి శిల్ప, కొండిన్య, భూదేవి, సత్యనారాయణ, ప్రదీప్, ఫరీదా నవాజ్, పూజిత పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు కళ్లాల వద్ద పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను భీమిలి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.91,400 నగదు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ డి.రమేష్, ఎస్‌ఐలు గంటా హరీష్, తాతారావు సిబ్బందితో దాడి చేసి వీరిని పట్టుకున్నారు. కేసును ఎస్‌ఐ గంటా హరీష్ దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధి పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: రాష్ట్రంలో వివక్షకు తావులేకుండా అన్ని వర్గాలకు మేలు చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీనగర్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాజీనగర్ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు రూ.89 లక్షలు, సంక్షేమ పథకాల కోసం రూ.26 కోట్లు ఖర్చు చేశామన్నారు. 320 మందికి ఇళ్ల పట్టాలు, డ్వాక్రా సంఘాలకు రూ.1.62 కోట్ల రుణమాఫీ, రూ.32 లక్షలు సున్నా వడ్డీ రాయితీ అందించిన ఘనత సీఎం జగన్‌దని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంచారన్నారు. 'నాడు – నేడు' ద్వారా ఆస్పత్రులు, పాఠశాలలు అభివృద్ధి చేశారని కొనియాడారు. టీడీపీ, జనసేన వల్ల ప్రజలకు ఒరిగేది ఏమీ లేదన్నారు. పాచిమెట్టకు రహదారి నిర్మాణం, రెండో విడత పట్టాల పంపిణీకి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మంజూరైన కళ్లద్దాలను లబ్దిదారులకు పంపిణీ చేశారు. జగనన్న ప్రభుత్వమే మళ్లీ రావాలంటూ మహిళలు జై కొట్టారు. కార్యక్రమంలో సచివాలయాల ఇన్‌చార్జి జగుపల్లి ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, జీవీ రమణ, విజయశంకర్, గూడెల నాని, జగుపల్లి విజయ్, రోహిత్, కోండ్రు రమణ, పిల్లా త్రినాథ్, పల్లా పెంటరాజు, గంగాధర్, జె.త్రిమూర్తులు, రమణ, తమ్మిన నరసింగరావు, చింతగుంట శివ, చిల్ల గణేష్‌రెడ్డి, పందిరి విజయ్, సిమ్మల ప్రసన్న, వెంపాడ వెంకటరమణ, గిడుతూరి వెంకటరావు, నీలాపు రామిరెడ్డి, జీరు శ్రీనివాసరెడ్డి, లెంక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగుపడిన పేదల జీవన ప్రమాణాలు

కొమ్మాది: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సుపరిపాలనలో నిరుపేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ 5వ వార్డు పరదేశిపాలెంలో శుక్రవారం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండా, సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నామని, లబ్ధిదారుల ఖాతాల్లోనే నేరుగా సంక్షేమ పథకాల లబ్ధి జమ చేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో మరలా వైఎస్సార్ సీపీ అభ్యర్థులకే మద్దతు పలకమని కోరారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలపై అన్నిచోట్లా ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మాయ మాటలు చెప్పి ప్రలోభాలకు గురి చేసేందుకు కొందరు నాయకులు వస్తారని, వారి మాటలు విని మోసపోకుండా సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డికే మళ్లీ పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి పోతిన హనుమంత్, జేఎస్ రెడ్డి, ముచ్చు రామారావు, బోయి సూరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిష్పాక్షిక పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం

మధురవాడ: రాజకీయం, కులం, మతం, ప్రాంతం చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ వాంబేకాలనీలో శనివారం మధ్యాహ్నం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల ఫ్లెక్సీ, వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 60 వేల మంది పింఛనుదారుల కోసం రూ.1800 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. వాంబే కాలనీలో 1600 కుటుంబాల సంక్షేమం కోసం రూ.23 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ కొనసాగాలంటే సీఎం జగన్‌నే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతీ చిన్న పనికీ జన్మభూమి కమిటీల సిఫార్సులు అవసరమయ్యేవన్నారు. అవినీతి, అక్రమాలు జరిగేవని ఆరోపించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చక్కగా వివరించిన ఆర్పీ సనపల విజయ, వలంటీర్ ప్రసన్న శైలజ, డ్వాక్రా మహిళ బి.చంద్రకళ తదితరులను సత్కరించారు. 7వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి పోతిన శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ కుడితి రామారావు, 8వ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు వేగి రామిరెడ్డి, వి.వాసు, ఎం.ఈశ్వరరెడ్డి, డాక్టర్ కాంతారావు, పి.ఎల్లాజీ, మంగమ్మ, భాను, ఎస్.రమణమ్మ, కె.తారక్, ఆశాజ్యోతి, జిల్లా నాయకులు పిళ్లా సూరిబాబు, సింహాచలం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెంద్ర అప్పన్న, చేకూరి రజని, తమ్మినేని వరలక్ష్మి, ఎంవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



వాంబేకాలనీలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీ వద్ద ఎమ్మెల్యే శ్రీనివాసరావు